## క్లుప్తంగా

### శివయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో పార్వతీ సమేత త్ర్యంబకేశ్వర స్వామిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కన్నబాబు భార్య శ్రీవిద్య, తండ్రి సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 7 నుంచి ఏబీవీపీ జాతీయ మహాసభలు

**బాలాజీచెరువు:** ఢిల్లీలో డిసెంబర్ ఏడు నుంచి పదో తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. మంగళవారం జేఎన్టీయూకే వీసీ చాంబర్‌లో వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఉన్న ఏబీవీపీ 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాలుగు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కన్వీనర్ సత్యసాయి, సభ్యులు పాల్గొన్నారు.

### జనవరి 6 నుంచి జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జేడీ నాగమణి



పోటీల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి తదితరులు

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జనవరి 6 నుంచి 10 వరకు లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల ఏర్పాట్లను ఆర్జేడీ నాగమణి మంగళవారం పరిశీలించారు. అండర్-19 విభాగంలో జాతీయస్థాయిలో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక జిల్లా క్రీడామైదానం, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కాంప్లెక్స్, డీమార్ట్ వెనుక ఉన్న మున్సిపల్ లాన్‌టెన్నిస్ కోర్టులను ఆర్జేడీ సందర్శించి పోటీలకు అనువుగా ఉన్నదీ లేనిదీ కోచ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆర్జేడీతో పాటు ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు, డీఎస్ఏ సీఈఓ, చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రభుత్వ గెజిటెడ్ హెచ్ఎం రంగారావు, పీడీ శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**2న రోలర్ స్కేటింగ్ ఎంపికలు**

పాఠశాల క్రీడా సమాఖ్య అండర్ 11, 14, 17 ఆధ్వర్యంలో డిసెంబరు 2న జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ప్రసాద్ మంగళవారం తెలిపారు. బాలురు, బాలికల విభాగంలో జరిగే ఈ ఎంపికలు కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో మధ్యాహ్నం 2 గంటలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల వారు ఈ ఎంపికలకు హాజరు కావాలని ఆయన కోరారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అడబాల జతిన్ సహకారంతో దుప్పట్లు అందించామని ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ తెలిపారు. డాక్టరు అద్దాల సత్యనారాయణ, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

### నరసింహావతారంలో సీతారామస్వామి



**బోట్‌క్లబ్:** రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యకు మహర్దశ

- ఐటీఐ ఆధునీకరణకు రూ.2.76 కోట్లు
- బోధనా పరికరాలకు కేటాయింపు
- ప్రతి విద్యార్థికీ ఉపాధే లక్ష్యంగా శిక్షణ



పాత పరికరాలతో శిక్షణ పొందుతున్న ఐటీఐ విద్యార్థులు

**బాలాజీచెరువు:** విద్యార్థులు ఏ కోర్సు అభ్యసించినా వారిలో సరైన కమ్యూనికేషన్స్ స్కిల్స్ లేకపోవడంతో వారు ఉద్యోగ సాధనలో రాణించలేకపోతున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరవుతున్నా పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ హబ్ లాంటివి ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐ కళాశాల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా నిధులు లేక నిర్వీర్యంగా ఉన్న కళాశాల ఈ నిధులతో విద్యాబోధనలో వచ్చిన కొత్త పరికరాలు కనుగోలు చేసి విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఎప్పటి నుంచో ఉన్న పాత ప్రాక్టికల్ పరికరాలు స్థానంలో కొత్తవి కనుగోలు చేయడానికి సిద్ధమమవుతున్నారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు వీటిలోని కోర్సులు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విద్యాసంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. కాకినాడ ఐటీఐలో అన్ని విభాగాల్లో కలిపి 1080 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

**ట్రేడ్‌లు ఇలా..**

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), కోపా, ఆర్అండ్ఏసీ ట్రేడ్‌లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రంటిస్ పూర్తిచేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

**నిరీక్షణకు మోక్షం..**



విద్యార్థులకు నేటికీ పాత తరం నాటి పరికరాలతో బోధించడం, మారిన సాంకేతిక పరికరాల కొనుగోలుకు నిధులు లేక సతమతమవుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 84 ప్రభుత్వ ఐటీఐలకు విడుదల చేసిన నిధుల్లో భాగంగా కాకినాడ ఐటీఐకు రూ.2.76 కోట్లు విడుదల చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2.47 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.29 లక్షలు ఇచ్చింది. ఇప్పటికే మొదటి దశలో భాగంగా రూ.96 లక్షలు ఖాతాలో జమ చేశారు. వీటితో కలెక్టర్ ఆదేశాల మేరకు మోటర్ మెకానిక్ విభాగానికి సంబంధించి ఆధునిక పరికరాలు కొనుగోలు చేస్తాం. రెండో దశలో ఎలక్ట్రానిక్స్, డ్రాఫమెన్ సివిల్, డీజిల్ మెకానిక్ విభాగాలు ఆధునీకరిస్తాం.

– ఎం.వేణుగోపాల వర్మ, ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల

# ఇంధనాన్ని భావితరాలకు అందిద్దాం

- జేఎన్టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు
- విద్యుత్ పొదుపు రేటింగ్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జేఎన్టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** జేఎన్టీయూకేలో **స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్** మిషన్, సిరి ఎక్సర్జీ కార్బన్ అడ్వ**యిజరీ సర్వీసెస్** ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించే రేటింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు హాజరై మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేసే గృహోపకరణాలపై ప్రజల్లో అవగాహన కల్పించి భావితరాలకు ఇంధన వనరులు అందించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. విద్యుత్ ఆదా చేసే ఉపకరణాలపై అవగాహన కల్పిస్తున్న సిరి ఎక్సర్జీ కార్బన్ అడ్వయిజరీ సర్వీస్ కృషి అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ సుమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేసే ఉపకరణాలను వినియోగించాలన్నారు. అనంతరం సిరి ఎక్సర్జీ కార్బన్ అడ్వయిజర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రమ్మణ్యం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇంధన వనరుల పొదుపు గురించి వివరించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, డాక్టర్ ఐవీ రమేష్‌కుమార్, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ప్రతినిధి సుమంత్, ఏపీటీ, జీపీటీ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

### భూ హక్కు పత్రాల పంపిణీ



లబ్ధిదారులతో నాయకులు, అధికారులు

**కరప:** ప్రభుత్వ భూ సంస్కరణలతో ఎస్సీ, ఎస్టీలు, పేదలు, భూమిలేని వర్గాలకు ఎంతోమేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతవరకు అసైన్‌మెంట్ భూములు పొందిన లబ్ధిదారులు వాటిని అనుభవించడమే కానీ ఎటువంటి హక్కులు ఉండేవి కావన్నారు. ఆయా భూములపై లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి యాజమాన్య హక్కులు కల్పించిందన్నారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధిలో 125 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములకు భూ బదలాయింపు హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చామన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు భూ బదలాయింపు హక్కు పత్రాలను అధికారులు, నాయకులు అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కొంగోడు సర్పంచ్ నక్కా బాబులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలను వంచించడమే చంద్రబాబు అజెండా

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పెగోడ పాఠశాలలో వై ఏపీ నీడ్స్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

**కాకినాడ:** అధికారం కోసం సొంత మామను వెన్నుపోటు పొడిచిన మాజీ సీఎం చంద్రబాబు ప్రజలను దగా చేసేందుకు మరోసారి సిద్ధమవుతున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 36, 37 డివిజన్లకు సంబంధించి పెగోడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ తనకంటూ ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టి అమలు చేయలేకపోయిన అసమర్థుడు చంద్రబాబు అని విమర్శించారు. పొరపాటున టీడీపీ, జనసేనలకు ఓటు వేస్తే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ఎన్నుకుంటే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన పాలన అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇంటింటికీ వెళ్ళి లబ్ధిదారులను గుర్తించడంతో పాటు వారి ఖాతాల్లోనే నేరుగా సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రావడంలేదా? అంటూ ప్రజలను ఆరా తీశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ లంకే హేమలత, స్థానిక నాయకులు బోయి చిన్నారెడ్డి, కామాడి కనకాద్రి, డేవిడ్, బెజవాడ బాబి, సీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి**

**కరప:** ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అటువంటి జగనన్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. మండలం వాకాడ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా పేదవర్గాల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలతో మమేకమై పని చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించి, తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ముందుగా గ్రామ సచివాలయం వద్ద అధికారులతో కలసి ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో వాకాడ, పెదకొత్తూరు గ్రామాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం రూ.34 కోట్లు మంజూరు చేసిందని తెలిపి, ఆయా గ్రామాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం గ్రామకూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ చెక్కపల్లి ఫకీర్రావు, వాకాడ, పెదకొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షులు అడబాల ప్రసాద్, చింతా బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కాకినాడ సిటీ:** కాకినాడ అర్బన్, రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏర్పడిన అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.దయామణి, కరప ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి మార్తమ్మ మంగళవారం తెలిపారు. రమణయ్యపేట-1 కోడ్ నంబర్ 96 అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలు పోస్టును ఎస్సీ కేటగిరికి, ప్రతాప్‌నాగర్-2 కోడ్ నంబర్ 82 కేంద్రంలో సహాయకురాలి పోస్టును ఓసీ కేటగిరికి కేటాయించినట్లు వివరించారు. రూరల్ మండలం తూరంగి గ్రామపంచాయతీ తూరంగి-3 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయక పోస్టును ఎస్టీ కేటగిరికి కేటాయించామన్నారు. కరప మండలం పెదకొత్తూరులో సహాయకురాలు పోస్టును బీసీ బీ కేటగిరికి కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు డిసెంబర్ 7వతేదీ లోపు పూర్తి చేసి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులు చేసుకొనే అభ్యర్థినులు 1, జులై, 2023వతేదీ నాటికి 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వారై ఉండాలన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యం

- ఈఆర్వో నాగనరసింహారావు
- రాజకీయ పార్టీలతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నాగనరసింహారావు

**కాకినాడ:** దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించడంలో ప్రజలతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫారం 6,7,8 ద్వారా దాదాపు 89వేల 769 దరఖాస్తులు రాగా, చాలా వరకు పరిష్కరించామని, మరో 17వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవన్నీ వచ్చే ఏడాది జనవరి 5వ తేదీలోపు పరిష్కరించి స్పష్టమైన, పారదర్శక ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాన్ని డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోసారి అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏమైనా సందేహాలు, సూచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చునని స్పష్టం చేశారు. ఆచూకీ లభించని ఓటర్లకు సంబంధించి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించిన నోటీసుల వివరాలను కూడా ఆయన సమావేశంలో వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధులు రోకళ్ల సత్యనారాయణ, ఎంజీకే కిశోర్, టీడీపీ ప్రతినిధులు తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, ఏఈ ఆర్వోలు సీతాపతి, మురళీకృష్ణ, జాన్‌బాబు, హరిదాసు, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### వచ్చేనెల 9 వరకు అభ్యంతరాలకు గడువు

ఆర్డీఓ ఈట్ల కిశోర్



ఓటర్ల జాబితా క్లెయిమ్‌లపై మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

**కాకినాడ సిటీ:** ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 క్లెయిములను డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని ఆర్డీవో ఈట్ల కిశోర్ వివరించారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువకులను ఓటర్లుగా చేర్చనున్నట్టు తెలిపారు. యువ ఓటర్ల నమోదుకు కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్టు ఆర్డీవో కిశోర్ వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, కె.విజయరామయ్య, సవరపు అప్పారావు, గదుల సాయిబాబా, టి నాగేశ్వరరావు, పి.చర్యన్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాత ఫూలే

ఎమ్మెల్యేలు కురసాల, ద్వారంపూడి



ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కన్నబాబు, చంద్రశేఖరరెడ్డి

**కాకినాడ రూరల్:** మహాత్మా జ్యోతిరావు ఫూలేకు కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఘన నివాళులర్పించారు. రమణయ్యపేటలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు అధ్యక్షతన సామాజిక విప్లవ కారుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ సమాజంలోని అందరికీ సమానమైన హక్కులు, బాధ్యతలు కావాలని, సమాజంలో మార్పు రావాలని, సాధికారత కావాలనీ నమ్మి తన భార్యతో సహా జీవితాన్ని మొత్తం ధారపోశారన్నారు. అటువంటి మహానుభావుడి స్ఫూర్తిని నిలబెట్టుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. ఫూలే స్ఫూర్తితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వెనక బడిన కులాలను తన బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా నిరూపించి ఆచరణలో చూపిస్తున్నారన్నారు. విజయవాడ నడిఒడ్డున అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మహాత్మాజ్యోతి ఫూలే ఆదర్శనీయుడన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి జ్యోతిరావు ఫూలే పాటు పడ్డారన్నారు. ఆయన వర్ధంతిని ఘనంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, జేఎన్టీయూకే వీసీ మెంబరు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కె.స్వప్న ఫూలే విగ్రహనికి నివాళులర్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫూలే చిత్రపటానికి అడబాల రత్నప్రసాద్, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్, డాక్టర్ అద్దాల సత్యనారాయణ తదితరులు నివాళలర్పించారు.

# రబీ సాగుకు సమాయత్తమవ్వండి

- ఖరీఫ్ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలి
- జేడీఏ విజయ్‌కుమార్



కేఎంజే కాలువలో గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

**కరప:** ఖరీఫ్ పంటకు ప్రభుత్వం ప్రకటించిన కనీసమద్దతు లభించాలంటే ఆర్బీకేల ద్వారా విక్రయించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన పాతర్లగడ్డలోని ఆర్బీకే, రైసుమిల్లును సందర్శించి రైతులతో మాట్లాడారు. రైస్‌మిల్లును సందర్శించి ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు వల్ల ఇబ్బందులేమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సాధారణ రకానికి 75 కిలోల బస్తాకు రూ 1,637, గ్రేడ్-ఎ రకానికి రూ 1,652 చెల్లిస్తున్నామని, సిబ్బంది సూచనల మేరకు ఖరీఫ్ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఖరీఫ్ పనులు పూర్తిచేస్తూనే రబీకి సమాయత్తం కావాలని జేడీఏ సూచించారు. సాగునీటి ఎద్దడి నివారణకు డిసెంబరు 10వ తేదీకి నారుమళ్లు, నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలని సూచించారు. కేఎంజే పంటకాలువలో గుర్రపుడెక్క, తూటుకాడ రబీ ప్రారంభానికి ముందుగా తొలగించాలని సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు వివరించారు. దీంతో జేడీఏ ఆ కాలువను పరిశీలించి అధికారులకు ఫోన్ చేసి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, టెక్నికల్ ఏఓ ఎ.గాయత్రీదేవి పాల్గొన్నారు.

### భూసేకరణ వేగవంతం చేయాలి

**కాకినాడ సిటీ:** మండలం తిమ్మాపురం నుంచి రాజానగరం వరకు నిర్మించ తలపెట్టిన ఏడీబీ రహదారి విస్తరణకు సంబంధించి కాకినాడ రూరల్, సామర్లకోట మండల పరిధిలో భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో ఈట్ల కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు కాకినాడ, సామర్లకోట మండలాల పరిధిలో సుమారు 12 కిలోమీటర్ల మేర భూ సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. భూ యజమానులకు నష్టపరిహారం అందజేసిన నేపథ్యంలో సదరు భూములలో జాతీయ రహదారి నిర్మాణానికి తక్షణం చర్యలు తీసుకోవాలని, అలాగే ఆక్రమణలు కూడా తక్షణం తొలగించాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారులు ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్, రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

# కార్తిక దీపారాధన ఎంతో పవిత్రం

- పరిపూర్ణానంద స్వామీజీ
- మహాశక్తి యాగం 15 రోజులు పూర్తి
- వైభవంగా కుంకుమార్చనలు, దీపార్చనలు



లలితాంబికకు హారతి ఇస్తున్న పరిపూర్ణానంద స్వామి



కోటి దీపోత్సవం వేదికపై నృత్య రూపకం ప్రదర్శిస్తున్న హైదరాబాద్ కళాకారిణులు



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

**కాకినాడ రూరల్:** స్థానిక శ్రీపీఠంలో పరిపూర్ణానంద స్వామిజీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం మంగళవారం నాటికి 15 రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పటికి 56 కోట్ల కుంకుమార్చనలు, బగళాముఖి జపం 42 లక్షలు పూర్తయ్యాయి. తొమ్మిది వేల అతిరుద్ర జపాలు కూడా పూర్తయ్యాయి. రోజూ సుమారు 16 వేలకు మందికి పైగా భక్తులు లలితా కుంకుమార్చనల్లో పాల్గొంటున్నారు. మంగళవారం ఉదయం టీటీడీ పండితుడు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. గురువును పూజించాలని, గురువు సందేశం విలువైనదన్నారు. అమ్మ పాదాలు, గురువు పాదాలు మరువకూడదన్నారు. పరిపూర్ణానంద స్వామిజీ మాట్లాడుతూ మహిళలు ఐశ్వర్యాంబిక, లలితమ్మ సేవలో తరిస్తూ కుంకుమార్చనల్లో పాల్గొంటున్నారని, కార్తికమాసంలో దీపారాధన చాలా పవిత్రమైనదని, నిత్యం కోటి దీపోత్సవంలో భక్తులు పాల్గొనడం అభినందనీయమన్నారు. సాయంత్రం దీపోత్సవం వేదిక వద్ద హైదరాబాద్‌కు చెందిన మృత్యుంజయ శర్మ, సీతాలక్ష్మిప్రసాద్‌ల నృత్యప్రదర్శన అలరించింది. కళాకారులు కూడా దీపోత్సవంలో పాల్గొన్నారు. వీరికి కాకినాడ మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని జ్ఞాపికలను అందజేశారు. అనంతరం బగళాముఖి హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.